




సత్యం మందపాటి

## మీకు తెలుసని నాకు తెలుసు 18

### సినిమా సాహిత్యం

ఇంతకుముందు తెలుగు సినిమాల్లో చక్కటి కథ, సంభాషణలు, మధురమైన పాటలు సాహిత్యపరంగా ఎంతో బాగుండేవి. తెలుగుతనం తొణికిసలాడేవి. సముద్రాల, దేవులపల్లి, శ్రీశ్రీ, ఆరుద్ర, ఆత్రేయ, మల్లాది, కొసరాజు, దాశరథి, అనిసెట్టి, సదాశివబ్రహ్మం, సినారె, ధర్మారావు, పద్మరాజు, నరసరాజు, పింగళి, రమణ, జంధ్యాల, ఆకెళ్ళ, జాన్సన్, నంది మొదలైన ప్రముఖులు తెలుగు సినిమా సాహిత్యానికి ఎంతో గౌరవం తెచ్చిపెట్టారు. ఈనాడు ఒక్క సిరివెన్నెల సీతారామశాస్త్రి తప్ప అలాటి సాహిత్యం వ్రాసే సత్తావున్నవాళ్ళు అసలు లేరని నేనను కానీ, ఈనాడు మన సినిమారంగంలో లేరని మాత్రం ముఖమాటం లేకుండా చెప్పగలను. అందుకనే కొన్ని చక్కటి పాటలని మననం చేసుకుంటూ, ఆ సాహితీవేత్తలని ఒకసారి గుర్తు చేసుకుందామని వుంది.

1. 'ఏకవీర' సినిమాలో ఒక చక్కటి కవిత. 'చుక్కలతో ఒక్కసారి సూచించెద. నా కన్నియ నల్లని వాల్జెడ లోపల మల్లియనై మలవాలని... ' తన కవిత్వంలో మల్లెల మాధుర్యాన్ని నింపిన ఇంత గొప్ప కవి ఎవరో?

2. 'సృష్టి చేసినది దేవుడైన మరి నాశము నేల సృజించె? కనుల నొసగినది దేవుడైన మరి అంధుల నేల సృజించె?' అని బాటసారిలో జీవిత పరమార్థాన్నే ప్రశ్నించిందెవరు?

3. 'మొగలి పూల వాసనతో జగతి మురిసిపోయింది. నాగమల్లి పూలతో నల్లని జడ నవ్వింది. పడుచుదనం అందానికి తాంబూలమిచ్చింది. ప్రాప్తమున్న తీరానికి పడవ సాగిపోయింది' తెలుగు సాహిత్యానికే ఇదో కర్పూర తాంబూలం. ఏ కవి హృదయంనించీ వచ్చిందో, మన హృదయాల్లో అలా కలకాలం నిలిచిపోయింది.

4. 'నిదుర మబ్బులను మెరుపు తీగవై కలలు రేపినది నీవే. బ్రతుకు వీణపై ప్రణయ రాగములు ఆలపించినది నీవే. పదము పదములో మధువులూరగా కావ్య కన్యవై రావే' నమస్కారం సార్. ఇంత గొప్ప కవిత్వాన్ని మాకందించిన మిమ్మల్నెలా మరచిపోగలం.

5. 'మరిగి పోయేది మానవ హృదయం. కరుణ నిచ్చేది చల్లని దైవం. వాడే లతకు ఎదురై వచ్చు వాడని వసంత మాసం. పసివాడని కుసుమ విలాసం' ఈకవి మానవతకి మహారాజు. భావుకతకి భోజరాజు. తెలుగు కవితకి నెలరాజు.

6. 'గుండె మంట లారిపే సన్నీళ్ళు కన్నీళ్ళు వుండమన్న వుండవమ్మ శాన్నాళ్ళు. పోయినోళ్ళందరూ మంచోళ్ళు. ఉన్నోళ్ళు పోయినోళ్ళ తీపి గురుతులు' చావు బ్రతుకుల సారాన్ని కన్నీళ్ళతో కడిగి, గుండె మంటలనార్పుతూ ఈ మహాకవి మనకిచ్చిన ఒక తీపి గురుతు ఇది.

7. 'నవ ధాన్యాలను గంపకెత్తుకుని, చద్దియన్నము మూట గట్టుకుని, ముల్లుకర్రను చేత బట్టుకుని, ఇల్లాలుని వెంటబెట్టుకుని... ఏరువాకా సాగారో రన్నో చిన్నన్నా.... ' ఈ విరించి జానపద సాహితీ బ్రహ్మ. సరదా పాటల మహారాజు.

8. 'నీ కర కంకణ నిక్వణమా అది వాణీ వీణా నినాదమా? నీ పద నూపుర నిస్వనమా అది జలధితరంగ మృదంగరావమా? రావే మోహన రూపమా, రావే నూతన తేజమా... ' నూతన తేజాన్నివ్వటమే కాకుండా, తెలుగు సాహిత్యాన్ని నేనే నడిపిస్తున్నానని సగర్వంగా చెప్పుకున్న కవి. శబ్ద సౌందర్యాన్ని నిశ్శబ్దంగా వాడి వెన్నులో వేడి పుట్టించిన మహాకవి.

9. తెల్లవార వచ్చె తెలియక నా స్వామి మళ్ళీ పరుండేవు లేరా అని తన మృదు మధురమైన మాటలతో మనల్ని మేల్కొలిపిన ఈ కవి, చక్కటి కథా రచయిత కూడాను.

10. 'రాధనురా నీ రాధనురా. రాసలీలల ఊసే తెలియని కసుగాయల కారాధనురా, ఎంతో తెలిసిన వేదంతులకే అంతు దొరకని గాధనురా' ఈయన పాళిలోనించి వచ్చేది అమృతం. రసభరిత కవితా ధార.

11. 'కాటుక కంటి నీరు పెదవుల నంటనీకు, చిరునవ్వు దీప కళిక చిన్నబోనీకు, నీ బుజ్జి గణపతిని బుజ్జగించి చెబుతున్నా నీ కుంకుమకెపుడూ పొద్దుగుంకదమ్మా... ' ప్రొద్దుగుంకుతున్న మన తెలుగు సినిమా సాహిత్యం, ఇలాటి రచయితల వల్లే ఇంకా సజీవంగా వుందేమో.

12. చల్లని వెన్నెలలో చక్కని కన్నె సమీపములో అందమె నాలో లీనమాయెనే ఆనందమె నా గానమాయెనే... ఇలాటి సరళీ స్వరాలతో మనల్ని అలరించిన కవి ఎవరో చెప్పుకోండి?